
సాక్షి
గుంటూరు

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



స్వామివారికి విశేష అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడిలోని గంగా పార్వతి సమేత భవానీ శంకరస్వామికి గురువారం విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 530.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,364 క్యూసెక్కులు విడుదలవుతోంది.



స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

లక్ష్మీపురం: ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో పోలింగ్ బాక్సులను భద్రపరిచే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి,జేసీ ఏ భార్గవ్ తేజ పరిశీలించారు.

తెగబడి.. ఎగబడి

- ఎక్కడికక్కడ పీడీఎఫ్ ఏజెంట్ల అడ్డగింత
- పలుచోట్ల దాడులకు తెగబడ్డ కూటమి నేతలు
- పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు కుమారుడిపైనా దాడి
- పోలింగ్ కేంద్రాల వద్దే డబ్బులు పంపిణీ
- కూటమి అభ్యర్థికి అండగా పోలీసులు
- కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించిన లోకేష్

'పట్టభద్రుల' ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి నేతలు అడ్డదారులు



మంగళగిరిలో సీకే హైస్కూల్ కేంద్రం వద్ద కేఎస్ లక్ష్మణరావు కుమారుడు, డ్రైవర్‌తో ఘర్షణ పడిన టీడీపీ వర్గాలు.. ఇరు వర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి నేతలు గెలుపు కోసం అడ్డదారులు తొక్కారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రిగ్గింగ్‌కు, దొంగ ఓట్లకు పాల్పడి తప్పుడు సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజా వర్గీయులు పలుచోట్ల దాడులకు పాల్పడ్డారు. మంగళగిరిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు కుమారుడిపై దాడికి తెగబడ్డారు. కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం జరిగింది. సాయంత్రం 4 గంటల సమయానికి కృష్ణా -గుంటూరు ఉమ్మడి జిల్లాలలో 65.59 శాతం ఓటింగ్ నమోదు కాగా, గుంటూరు జిల్లాలో 62.61 శాతం నమోదైంది. రాత్రికి ఇది ఉమ్మడి జిల్లాలో 69.57 శాతానికి, గుంటూరు జిల్లాలో 66.45 శాతానికి పెరిగింది. పోలింగ్ ముగిసిన తర్వాత 4 శాతానికి పైగా ఓటింగ్ పెరగడంపై మిగిలిన అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పల్నాడులోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో తొంబైశాతం వరకూ పోలింగ్ నమోదు కావడంతో అక్కడ రిగ్గింగ్ జరిగిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 90 శాతం దాటిన ప్రతిచోట రీపోలింగ్ పెట్టాలని కోరుతామని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తెలిపారు.

ఓటమి భయంతో అక్రమాలు

ఓటమి భయంతో కూటమి నేతలు పెద్దఎత్తున అక్రమాలకు తెరలేపారు. ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేయించారు. ఉదయం పది గంటలకు పోలింగ్‌కు వెళ్లిన పలువురికి తమ ఓటు ఎవరో వేసేసారని చెప్పడంతో నిరాశగా వెనుతిరిగారు. పల్నాడుతోపాటు బాపట్ల జిల్లాలో కొన్ని చోట్ల పోలింగ్ ఏజెంట్లను బూత్‌ల నుంచి వెళ్లగొట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి నేతలు పెద్దఎత్తున హల్‌చల్ చేశారు. కూటమి నేతలు ప్రచారం చేస్తున్నా పోలీసులు మిన్నకుండిపోయారు. మరికొన్ని చోట్ల సహకరించారు. ఓటరు స్లిప్‌లతో పాటు డబ్బులు కూడా పంపిణీ చేశారు. అదేసమయంలో పీడీఎఫ్ నేతలను దగ్గర ఉండకుండా వారిని పంపించి వేశారు.



గుంటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో క్యూలైనులో ఓటర్లు

దాడులు.. దొంగ ఓట్లు

మధ్యాహ్నం మూడున్నర నుంచి పెద్దఎత్తున గుంపులు గుంపులుగా వెళ్లి దొంగ ఓట్లు వేశారు. కొంత మందిని పీడీఎఫ్ అభ్యర్థి తాలూకా వాళ్లు పట్టుకుని పోలీసులకు అప్పగించినా తర్వాత వారిని వదిలిపెట్టేశారు. ఆలపాటి రాజాకు సొంత పార్టీతో పాటు కూటమి నేతలు కూడా మొదటి నుంచి సహాయ నిరాకరణ చేయడంతో ఓటమి భయంతో రిగ్గింగ్, దొంగ ఓట్లను నమ్ముకున్నట్లు పోలింగ్ సరళిని చూస్తే స్పష్టంగా కనపడుతోంది. తెలుగుదేశం ఎమ్మెల్యేలు బూత్‌లలో తిరుగుతూ హడావిడి చేశారు. చీఫ్ ఏజెంట్లు, అభ్యర్థులు మినహా ఎమ్మెల్యేలకు బూత్‌లలోకి వెళ్లే అధికారం లేకపోయినా వారు హడావిడి చేశారు. తెనాలిలోని కోగంటి శివయ్య మున్సిపల్ పాఠశాలలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేశారు. గుంటూరులో జనసేన నేతలు హడావిడి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేశారు. చలమయ్య హైస్కూల్ వద్ద జనసేన నాయకుడు చల్లా ప్రసాద్ పీడీఎఫ్ సభ్యులు శనగపల్లి కార్తీక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రంగప్పలపై దాడికి పాల్పడ్డాడు. మంగళగిరిలో కేఎస్ లక్ష్మణరావు కుమారునిపై దాడికి తెగబడ్డారు. అదే సమయానికి పోలీసులు రంగప్రవేశం చేసి తెలుగుదేశం నాయకులను అడ్డుకున్నారు. మంత్రి లోకేష్ తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో కూర్చుని ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో వారు కిందిస్థాయిలో రెచ్చిపోయి దొంగ ఓట్లు వేయించారు.



తాడికొండలోని ఓ పోలింగ్ కేంద్రంలో యథేచ్ఛగా తిరుగుతున్న టీడీపీ శ్రేణులు

ఓటు వేసిన ప్రముఖులు..

గుంటూరు గుజ్జనగుండ్లలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలో, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మరో మంత్రి నాదేండ్ల మనోహర్ తెనాలిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు వేసిన కలెక్టర్, జేసీ

లక్ష్మీపురం : గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్‌లోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 213లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 211 బూత్‌లో జేసీ భార్గవ్‌తేజ ఓటు వేశారు.





జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లోని కంట్రోల్ రూము నుంచి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్, లైవ్ ఫీడ్‌ను సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, డీఆర్‌ఓ ఎస్.ఎస్.కె.ఖాజావలితో కలిసి కలెక్టర్ నిరంతరం పర్యవేక్షించారు. గుంటూరు జిల్లాలో 71,836 మంది (66.45 శాతం), బాపట్ల జిల్లాలో 18,198 (74.30 శాతం), పల్నాడు జిల్లాలో 44,263 (77.33 శాతం) మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



ఐతానగర్ పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. పోలింగ్ సరళి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జిల్లాలో ఎనిమిది కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించామని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. లింగారావు సెంటరులోని పోలింగ్ కేంద్రానికి వెళ్లిన ఎస్పీ అక్కడ సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట డీఎస్పీ బి.జనార్ధనరావు, టూ టౌన్ సీఐ రాముల నాయక్ ఉన్నారు.

న్యూస్‌రీల్

'కోటి గోటి' తలంబ్రాలు ఊరేగింపు



ఫిరంగిపురం: గుంటూరుకు చెందిన బాలాజీ సేవాసమితి ఆధ్వర్యంలో కోటిగోటి తలంబ్రాల ఊరేగింపు మండలంలోని రేపూడి గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సేవాసమితి ఫౌండర్స్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎ.వెంకటరమణ, ఎం.రాంబాబులు మాట్లాడుతూ రేపూడి, గుంటూరు, ఏటుకూరు, తాడికొండ, నల్లపాడు గ్రామాల్లో భక్తులకు కొత్తగా వచ్చిన ధాన్యం అందజేశామన్నారు. దానిని భక్తులు తమ గోటితో ఒలుస్తారన్నారు. ఈ బియ్యంను సేకరించి మార్చి మొదటివారంలో భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి పంపిస్తామని వాటిని తలంబ్రాల బియ్యంలో వాడతారని చెప్పారు. గ్రామంలో ఇప్పటివరకు ఒలిచిన తలంబ్రాల బియ్యాన్ని వేడుకగా ఊరేగించారు.

యార్డులో 1,03,526 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 99,747 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,03,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,700 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,699 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

'క్వారీ' తిరునాళ్ల ఆదాయం రూ.16.37 లక్షలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్ల ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. దేవస్థానం వద్ద గురువారం దేవదాయశాఖాధికారులు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంను నిర్వహించారు. హుండీ కానుకల ద్వారా రూ.6,72,636, అభిషేకం, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.6,76,195, వివిధ రకాల వేలం ద్వారా 2,88,800 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవస్థానానికి మొత్తంగా రూ.16,37,631లు ఆదాయం సమకూరిందని దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు తెలిపారు. గత ఏడాది రూ.14,00,692 ఆదాయం రాగా గత ఏడాది కన్నా ఈ దఫా రూ.2,36,939 అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

త్రికోటేశ్వరుని తిరునాళ్ల ఆదాయం రూ. 1.77 కోట్లు



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి రూ.1,77,68,172 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు తెలిపారు. ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. కానుకల ద్వారా రూ.73,47,918, పూజా టికెట్లు విక్రయం ద్వారా రూ.65,01,070, ప్రసాదాల ద్వారా రూ.38,17,395, అన్నదానం, ఇతర సేవలు, స్కీములకు రూ.1,01,789 లభించినట్లు వివరించారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.14.19లక్షల అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రకుమార్, ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా ముక్తేశ్వరుడి తిరునాళ్ల

రేపల్లె రూరల్: మహా శివరాత్రి పురస్కరించుకుని మండలంలో దక్షిణ కాశీగా పేరొందిన మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు, బిల్వ దళాలతో ప్రత్యేకంగా పూజ లు చేశారు. రాచూరి జమీందార్ రాజామాణిక్యారావు సిద్ధార్థ మార్కండేయ రావు బహదూర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు చావలి సురేష్‌శర్మ పర్యవేక్షణలో బుధవారం రాత్రి ముక్తేశ్వరస్వామి-పార్వతీదేవిల కల్యాణం నిర్వహించారు.

చూసిన కనులదే భాగ్యము



అమరావతిలో అమరేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న జనవాహిని

వైభవంగా అమరేశ్వరుని దివ్య రథోత్సవం

- ఉభయ దేవేరులతో ఊరేగిన అమరేశ్వరుడు
- శివపంచాక్షరి నామంతో మార్మోగిన అమరారామం
- భక్తజన సంద్రంగా మారిన అమరావతి

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాలలో అమరావతి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన చింకా, ఆలపాటి, కోనూరు వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు, ఈ గుర్రాలను రథంపై ముందు భాగంలో అలంకరించారు. భక్తులు ఓం నమశ్శివాయః అంటూ అమరారామం మార్మోగేలా శివనామస్మరణ చేస్తుండగా మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుడిని గాలిగోపురంలో ఉంచి పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్యరథానికి ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, వాస్తు మండపారాధన, రథాంగ హోమం, రథ సంప్రోక్షణ, రథబలి కార్యక్రమాలను నిర్వహించి అష్ట దిక్పాలకులు శాంతి కోసం కుంభంపోసి దీపారాధన చేయటంతో రథోత్సవం ప్రారంభ క్రతువును పూర్తి చేశారు.

సర్వాంగ సుందరం..

వివిధ రకాల, రంగురంగుల పూలతో సర్వాంగసుందరంగా అందంగా అలంకరించిన దివ్యరథంపై ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుని కొలువుదీర్చారు. స్వామివారి రథోత్సవాన్ని సుమారు నాలుగున్నర గంటలకు ప్రారంభించారు. ఆలయ గాలిగోపురం వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మేళతాళాలతో, భక్తుల శివ నామసంకీర్తనలతో, విచిత్ర వేషధారణలతో, నందీశ్వరుడు ముందుండి నడిపిస్తుండగా అత్యంత వైభవోపేతంగా సాగింది. వేలాది మంది భక్తులు స్వామి వారి రథాన్ని గాంధీబొమ్మ సెంటర్ వరకు అక్కడ నుంచి వెనుదిరిగి శివనామస్మరణ చేస్తూ రథశాలలోకి చేర్చారు.

పోటెత్తిన భక్తులు..

మండల పరిధి గ్రామాల నుంచే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి భక్తజన సంద్రమైంది. అలాగే దివ్యరథంలో ఊరేగుతున్న అమరేశ్వరుని దర్శించెందుకు భక్తులు రోడ్లకు ఇరువైపులా ఉన్న భవనాలపై నిలబడి దర్శించు కున్నారు. ఈ ఉత్సవంలో విచిత్ర వేషధారణలు, నెల్లూరు జిల్లా నుంచి తీసుకువచ్చిన బాజా భజంత్రీలు భక్తులను ఆకర్షించాయి. రథోత్సవం పురస్కరించుకుని భద్రతా ఏర్పాట్లలో భాగంగా ప్రధాన రహదారిపై పోలీస్‌శాఖ పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో సీఐ అచ్చియ్య నేతృత్వంలో సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కల్యాణ వైభోగమే..!

- అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివాలయంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కల్యాణం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా అర్చకులు గజవాహనంపై ఎదుర్కోలోత్సవం జరిపించారు. ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్, అర్చకులు, భక్తుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువునకు ముందుగా తాంబూలాలు మార్చుకున్నారు. అనంతరం గురువారం తెల్లవారుజామున కనుల పండువగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయంలో జరిగే లింగోద్భవ కాలమున స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో జరిగే అభిషేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి కళ్యాణం తిలకించి పరవశించారు.

నేత్రపర్వం.. మల్లేశ్వరుని రథోత్సవం



దేవాలయం వద్ద ప్రారంభమైన స్వామివారి రథోత్సవం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలో వేంచేసి యున్న శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులను అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య తీసుకు వచ్చి రథంపై అధిష్టింప చేశారు. స్వామివారిని, రథాన్ని రంగు రంగుల పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. రథోత్సవంలో రథం ఎదుట ఆనవాయితీగా శాలివాహనులు కుంభం వారబోశారు. మేళతాళాలు, కనక తప్పెట్లు, విచిత్ర వేషధారణలో బాణసంచా పేలుళ్ల మధ్య రథోత్సవం సాగింది. దేవస్థానం నుంచి మెయిన్ బజారు, సాధుసోడా సెంటర్, పూల మార్కెట్ సెంటర్ మీదుగా మిద్దె సెంటర్ వరకు వెళ్లి తిరిగి అదే మార్గంలో దేవస్థానానికి చేరుకుంది. రథంపై గంగా భ్రమరాంబ సమేతుడై పురవీధుల్లోకి వేంచేసిన మల్లేశ్వరుడిని ఆయా సెంటర్లలో భక్తులు దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూర నీరజనాలు సమర్పించారు. ఈ రథోత్సవానికి కైంకర్యపరులుగా వేలూరి శివావధానులు, సురేష్‌బాబు, రమేష్‌బాబు, సాయిబాబు, శివరామకృష్ణ శాస్త్రి, సుబ్రహ్మణ్యాలు వ్యవహరించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థాన ఈవో జేవీ నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రథం లాగుతున్న మంత్రి నారా లోకేష్

రథోత్సవంలో మంత్రి నారా లోకేష్

శివరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణ, అశేష జన సందోహం మధ్య రథోత్సవంలో పాల్గొన్న మంత్రి రథాన్ని లాగారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,200** గరిష్ఠం : రూ. **6,300**

మోడల్ ధర రూ. **5700**

క్లుప్తంగా

ఆరవ పటాలంలో శివరాత్రి వేడుకలు



మంగళగిరి: నగర పరిధిలోని 6వ బెటాలియన్‌లో గురువారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ కె. నగేష్‌బాబు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం భక్తులకు కమాండెంట్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి. ఆశీర్వాదం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ



లక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ తనిఖీ చేశారు. మేడికొండూరు మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్, ఫిరంగిపురం మండలం సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలు 203, 204, 205, 206, 206ను తనిఖీ చేశారు. ఓటర్ల వద్ద ఓటర్ స్లిప్పులు, గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఆయన వెంట మేడికొండూరు, ఫిరంగిపురం తహసీల్దార్లు, సెక్టార్ ఆఫీసర్, సెక్టార్ పోలీస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రెడ్డి సంఘం మహిళా విభాగ రీజినల్ కోఆర్డినేటర్‌గా శ్రీరెడ్డి



చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుంటూరు శ్రీరెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా విభాగ రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆమె గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి జాతి శ్రేయస్సు, ఐక్యత కోసం కృషి చేసేందుకు గానూ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల మహిళా విభాగం రీజినల్ కోఆర్డినేటర్‌గా తనను కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కాలవ శ్రీలతరెడ్డి నియమించినట్లు ఆమె పేర్కొన్నారు. రెడ్ల సమస్యల పరిష్కారానికి, ఐక్యతకు శక్తి మేర కృషి చేయనున్నట్లు శ్రీరెడ్డి తెలిపారు.

రైతులకు సమస్యలు లేకుండా చూడండి

బొల్లాపల్లి : జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రీసర్వే పనుల గురించి ఆరా తీశారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. రీసర్వే పనుల్లో రెవెన్యూ శాఖ తరఫున సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు.

అక్రమాలకు తెగబడిన అధికార పార్టీ

ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు ధ్వజం

మంగళగిరి టౌన్: కృష్ణా గుంటూరు జిల్లాల శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడుతోందని పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీకే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని బూత్‌లలో తమ ఏజెంట్లను బయటకు పంపించి వేశారని తెలిపారు. ఇదేమి న్యాయం ? అని ప్రశ్నించారు. చేతనైతే తలపడాలి గానీ ఏజెంట్లను బయటకు పంపడం ఏమిటని మండిపడ్డారు. తెనాలిలోని మున్సిపల్ హైస్కూలులోని ఏడు బూత్‌లలో ఓ వ్యక్తి పెద్దఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేశాడని ఆయన పేర్కొన్నారు. మంగళగిరిలో కూడా అదేవిధంగా జరుగుతోందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు పోలింగ్ కేంద్రాల గేట్ల వరకు వచ్చి ప్రచారం చేసుకుంటున్నారని, తాము ప్రచారం చేసుకోకూడదా ? అంటూ ప్రశ్నించారు. అధికార పార్టీ అరాచకాలపై, ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘ అధికారి వివేక్ యాదవ్‌కు, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మణరావు

లక్ష్మణరావు కుమారుడి డ్రైవర్‌పై దాడికి యత్నం

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు మంగళగిరి సీకే హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆ సమయంలో లక్ష్మణరావు కుమారుడు, కారు డ్రైవర్‌పై పలువురు దాడికి యత్నించారు. కారు డ్రైవర్ టీడీపీ ఏజెంట్లను ఫోన్‌లో వీడియోలు తీస్తున్నాడంటూ కార్యకర్తలు అతడిపై ఎగబడ్డారు. ఇంతలో లక్ష్మణరావు కుమారుడు కార్ డ్రైవర్‌ను ఆపే ప్రయత్నంలో భాగంగా ఇద్దరి మధ్యా తోపులాట జరిగింది. అది ఘర్షణకు దారి తీసింది. లక్ష్మణరావు కుమారుడు, కారు డ్రైవర్‌పై అక్కడ ఉన్న టీడీపీ కార్యకర్తలు చేయి చేసుకున్నారు. అక్కడున్న పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా కూడా కార్యకర్తలు దాడికి యత్నించారు. పోలీసులు అడ్డుకుని ఇరువర్గాల వారిని అక్కడి నుంచి పంపించివేశారు.

ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్

మంగళగిరిలో జరుగుతున్న కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల అవతల మాత్రమే ఏజెంట్లు ఉండాలని, ఆలోపు ఉన్నవారిని అక్కడి నుంచి పంపాలని అధికారులను ఆదేశించారు. అయినా కూటమి నేతలు అక్కడి నుంచి కదలకపోవడంతో పోలీసుల సహాయంతో 100 మీటర్ల అవతల కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. స్వయంగా సిబ్బందితో కలసి ఆమె టేబుల్స్‌ను 100 మీటర్ల అవతలకు తరలించారు.



లక్షణరావు కారు డ్రైవర్‌తో వాగ్వివాదం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



అధికారులకు సూచనలు చేస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన

దొంగ ఓట్లు వేయించిన అధికారపక్షం

కొల్లూరు: అధికార పక్షం తప్పొప్పులు తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతిపక్షానికి స్వేచ్ఛ అవసరం అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. గురువారం కొల్లూరులో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఆమె వచ్చారు. టీడీపీ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద వ్యవహరిస్తున్న తీరు చూసి మండిపడ్డారు. టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఏజెంట్లను బెదిరించి కూర్చోకుండా చేయడం దారుణమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరులో ఓ యువకుడు పీడీఎఫ్ అభ్యర్థికి ఏజెంట్‌గా ఉంటున్న విషయాన్ని తెలుసుకొని ఇసుక క్వారీలో పనిలేకుండా చేస్తామని బెదిరించారు. చుండూరు మండలంలో సైతం ఏజెంట్‌లుగా ఉన్న వారిని అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పలు మండలాలతోపాటు, కొల్లూరులో సైతం టీడీపీ నాయకులు గుంపులుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని దొంగ ఓట్లు వేయించారన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులపై సైతం టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే కాదు, అధికార పక్షానికే నష్టమన్నారు. బెదిరింపులకు పాల్పడటంపై ఆమె ధ్వజమెత్తారు. పట్టభద్రులకు సరైన స్వేచ్ఛ ఇవ్వకుండా టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగడం మంచి చర్య కాదన్నారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు బి. సుబ్బారావు, బీఎల్‌కే ప్రసాద్ ఉన్నారు.

శివయ్య కల్యాణం.. నయన మనో'హర'ం

- వైభవంగా నాగేశ్వరస్వామి రథోత్సవం
- హర హర నామస్మరణతో మార్మోగిన చేబ్రోలు పుర వీధులు
- వైభవంగా క్వారీ బాలకోటేశ్వరుని తిరునాళ్ల
- ఆకట్టుకున్న భారీ విద్యుత్ ప్రభలు

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం భక్తుల హరనామ స్మరణతో గురువారం స్థానిక పుర వీధుల్లో అత్యంత వైభవంగా జరిగింది. వంద సంవత్సరాల పురాతన భారీ రథంపై కొలువైన కల్యాణ మూర్తులను దర్శించడానికి చేబ్రోలు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా నాగేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం ఉత్సమూర్తులైన నాగేశ్వరస్వామి, గంగాదేవి, పార్వతీదేవి అమ్మవార్లను రథం మీద చేబ్రోలు పురవీధుల్లో విహరించారు. పాత పోలీసు స్టేషన్ సమీపంలో కొద్ది సేపు ఆపి గంగానమ్మ తల్లికి పూజలు చేశారు. భక్తులకు గ్రామస్తులు పులిహోర, పొంగలి, మజ్జిగ తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. చేబ్రోలు పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు రథం తాడును లాగడానికి ఉత్సాహం చూపారు. మహిళలు, పిల్లలు,యువకులు రథోత్సవంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఏర్పాట్లను దేవాదాయశాఖ ఈవో పర్యవేక్షించారు.



వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభ



చేబ్రోలులో స్వామి రథోత్సవం



కల్యాణోత్సవంలో గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి

కనుల పండువగా కల్యాణోత్సవం

లింగోద్భవ కాలంలో స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణోత్సవం అనంతరం నంది వాహనంపై కల్యాణమూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు.

తిరునాళ్ల శోభ.. ప్రభల కాంతులు

క్వారీ తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభల కాంతులు వెలుగులు నింపాయి. జిల్లాలో కోటప్ప కొండ తరువాత పేరు గాంచిన వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది వివిధ గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. క్వారీ ఆలయం ప్రాంగణం వద్ద చేబ్రోలు గ్రామ భారీ విద్యుత్ ప్రభ వెలుగులు నింపింది. నారాకోడూరు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, సుద్దపల్లి, వడ్లమూడి, శలపాడు తదితర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి.

క్వారీ బాలకోటేశ్వరునికి ప్రత్యేక పూజలు



వడ్లమూడి క్వారీ ఆలయంలో స్వామి

వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామికి బుధవారం రాత్రి లింగోద్భవ సమయంలో అర్చకుడు గూడూరు సాంబ శివరావు బృందం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 12గంటల తరువాత ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవదాయ శాఖాధికారులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

నాగభైరవ సాహితీ పురస్కారాల ప్రదానం

నగరంపాలెం: జాతీయ కవి, కవిరత్న డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు కలం నుంచి జాలువారిన సాహితీ సౌరభాలు వర్తమాన, భవిష్యత్, రచయితలకు సాహిత్యవేత్తలకు దిక్సూచిలు అని ప్రముఖ విద్యావేత్త పెంట్యాల శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై నాగభైరవ కోటేశ్వరరావు సాహిత్య పురస్కార సభ నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు డాక్టర్ జక్కంపూడి సీతా రామారావు అధ్యక్షత వహించారు. అనంతరం డాక్టర్ నూనె అంకమ్మరావు, డాక్టర్ సెట్లం చంద్రమోహన్‌లకు పురస్కారాలను అందించారు. సభలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర తెలుగు రచయితుల సంఘం అధ్యక్షులు తేళ్ల అరుణ, రచయిత, సంపాదకులు మోదుగుల రవికృష్ణ, ప్రజా గాయకుడు నూకతోటి శరత్‌బాబు పాల్గొన్నారు.



అంకమ్మరావు, చంద్రమోహన్‌లకు పురస్కారాలు అందిస్తున్న అతిథులు

ఉద్యోగాలకు ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఎంపిక

తెనాలి: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, మార్కెటింగ్ కొలువులను అందుకుంటున్న స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ విద్యార్థులు తాజాగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలకు ఎంపికవటం విశేషం. ఏఐకు సంబంధించి రెండు సంస్థలు తమ కాలేజీలో జరిపిన ఇంటర్వ్యూల్లో మొత్తం 39 మంది ఫైనలియర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. కంపెనీల నుంచి వచ్చిన ఆఫర్ లెటర్స్‌ను గురువారం ఆయన విద్యార్థులకు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ బెంగళూరు కేంద్రంగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ 24/7 ఏఐ సంస్థకు ఐదుగురు విద్యార్థులు ఏఐ డిజిటల్ అసోసియేట్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. చెన్నై కేంద్రంగా పని చేస్తున్న బ్రాండ్ ఫోర్ బ్రాండ్స్ కంపెనీకి ఒక విద్యార్థిని డిజిటల్ మార్కెటింగ్ డేటా అనలిస్టుగా, మరో 33 మంది హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్స్‌గా ఎంపికైనట్టు చెప్పారు. వీరికి వార్షిక వేతనం రూ.2.6 లక్షల నుంచి రూ.3.6 లక్షల వరకు లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటికి డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 95 శాతం మందికి ఉద్యోగాలు లభించాయని చెప్పారు. ప్రస్తుత డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కళాశాలలో రెగ్యులర్ శిక్షణతో పాటు ఏఐ టూల్స్ బేస్డ్ శిక్షణకు ప్రాధాన్యతను ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తెలియజేశారు.



ఎంపికైన విద్యార్థులతో అన్నాబత్తుని శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

డీఆర్ఎం కార్యాలయంలో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన బ్యాడ్మింటన్ కోర్టు, స్పోర్ట్స్ రూమ్‌ను డీఆర్ఎం రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే నూతన హంగులు, ఆహ్లాదకర వాతావరణంలో కోర్టును నిర్మించడం అభినందనీయమని తెలిపారు. ఎల్ఈడీ లైటింగ్ సిస్టం, రబ్బరు కుషన్ టెక్నాలజీతో కొత్త రకం కలపను అమర్చినట్లు చెప్పారు. డివిజన్ ఉద్యోగులంతా కోర్టులో కొంతసేపు ఆడి ఒత్తిడిని తగ్గించుకుని, ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి రోజూ 45 నిమిషాల పాటు వ్యాయామం, జిమ్, యోగా చేయడం వల్ల పనిలో ఉన్న ఒత్తిడిని కొంత మేర తగ్గించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, సీనియర్ డీఓఎం ఎం.దినేష్‌కుమార్, ఏడీఎంఈ ఎం.రవీంద్రనాథ్, సీనియర్ డీసీఎం సీహెచ్.ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఈఎన్ కో- ఆర్డినేషన్ జె.వి. అనూష, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, డీసీఎం కమలాకర్‌బాబు, ఏఎస్‌సీ శైలేష్ కుమార్ పాల్గొన్నారు.



కోర్టును ప్రారంభిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేట టౌన్: మహా శివరాత్రి పర్వదినం జాగారం చేసి తిరిగి ఇంటి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చిలకలూరిపేట మండలంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన కొందరు పర్చూరు మండలంలోని అన్నంభొట్లవారిపాలెం గ్రామానికి ఇటీవల పొగాకు కోతలకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మహా శివరాత్రి నేపథ్యంలో కోటప్పకొండకు కొమరగిరి శ్రీకాంత్, చౌటురి సురేంద్రబాబులు బైక్‌పై బుధవారం రాత్రి వెళ్లారు. రాత్రంతా జాగారం చేసి తిరిగి వచ్చే క్రమంలో గురువారం తెల్లవారుజాము 4.30 సమయంలో పోతవరం బటర్‌ఫ్లై వెంచర్ సమీపంలో వీరు నడుపుతున్న బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న సురేంద్రబాబు(21)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి.

పాత జాతీయ రహదారిపై ప్రమాదం

- నుజ్జు నుజ్జయిన ద్విచక్రవాహనం
- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థి

తాడేపల్లి రూరల్: మంగళగిరి నుంచి ప్రకాశం బ్యారేజీకు వెళ్లే పాత జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంక్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విజయవాడకు చెందిన విద్యార్థి స్నేహితుడితో కలసి బ్యారేజ్ నుంచి ఉండవల్లి సెంటర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పాత జాతీయ రహదారిపై పోలకంపాడు లారీ స్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న అగ్నిమాపక వాహనాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు టైర్ ఊడిపోయి నుజ్జునుజ్జయింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి స్వల్ప గాయాలు కాగా, మరొకరు సురక్షితంగా బయటపడ్డాడు. స్వల్పంగా గాయపడిన విద్యార్థిని ప్రైవేటు వాహనంలో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద స్థలంలో ద్విచక్ర వాహనం

ముళ్ల పొదల్లో నవజాత శిశువు

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత
- వినుకొండ రూరల్ మండలం నడిగడ్డలో ఘటన

వినుకొండ: వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ గ్రామంలో నవజాత శిశువును ముళ్లకంపలో పడేసిన దారుణ సంఘటన గురువారం ఉదయం జరిగింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే శిశువు ప్రాణాలు కోల్పోయింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామంలోని రోడ్డు పక్కన ముళ్ల కంపలో శిశువు ఏడుపు వినిపిస్తుండటంతో స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మగ శిశువుగా గుర్తించారు. శిశువును బతికుండగానే ముళ్ల పొదల్లో వదిలిపెట్టడం చూపరులను సైతం కలచివేసింది. కదలలేని స్థితిలో ఉన్న శిశువును ఓ వైపు చీమలు కుడుతుండగా.. ముళ్లు గుచ్చుకుంటూ రక్తం కారింది. తొలుత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత స్పందించారు. ప్రథమ చికిత్స అనంతరం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా పేరేచర్ల వద్దకు వెళ్లగానే శిశువు మృతి చెందింది.



నవజాత శిశువ

తిరునాళ్లలో దొంగల చేతివాటం

పెద్ద ఎత్తున సెల్‌ఫోన్‌లు, బైకులు చోరీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. తిరునాళ్లకు వచ్చిన యాత్రికుల పర్సులు, సెల్‌ఫోన్‌లు అపహరించారు. ఈ మేరకు బాధితులు పలువురు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. నరసరావుపేటకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికుడు టిక్కెట్టు తీసుకునేందుకు ప్రయత్నించగా అప్పటికే జేబులోని డబ్బును దొంగలు కాజేశారు. గత్యంతరం లేక బస్సులో నుంచి దిగిపోయాడు. తిరునాళ్లలో ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శన చూసే సమయంలో, ప్రధాన రహదారుల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు చేతికి పనిచెప్పారు. అలాగే ద్విచక్రవాహనాలు కూడా చోరీకి గురయ్యాయి. ఖాళీ ప్రదేశాల్లో ద్విచక్ర వాహనాలను నిలిపి తిరునాళ్లకు వెళ్లిన వారి వాహనాలను చోరీ చేశారు.

కనుల పండువగా తెప్పోత్సవం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో తెప్పోత్సవం వేడుకలు గురువారం కనులపండువగా నిర్వహించారు. మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. చల్లగుండ్ల గ్రామానికి చెందిన మడకా వెంకటేశ్వర్లు, రామతులసి, పాట్లవీడు గ్రామానికి చెందిన చుండూరు శివశంకర శ్రీనివాసరావు, వెంకట్రావమ్మల ఆధ్వర్యంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయంలోని కోనేటిని రంగురంగుల పూలతో శోభాయమానంగా అలంకరించారు. హంస వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరాయి. భక్తుల శివనామస్మరణల నడుమ తెప్పోత్సవం సాగింది.

గుండెపోటుతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి

అచ్చంపేట: వైఎస్సార్ సీపీ నాయకులు, అచ్చంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి (67) గురువారం తెల్లవారుజామును 4 గంటల సమయంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన గత నెలరోజులుగా గుంటూరులో చికిత్స పొందుతూ, నాలుగు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం వారి కుమారులు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 4 గంటల సమయంలో మృతి చెందారు. మండలంలో వైఎస్సార్ సీపీకి పెద్దదిక్కుగా, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఆత్మీయునిగా పేరుంది. 2019లో వైఎస్సార్ సీపీకి మెజార్టీ రావడానికి ప్రధాన పాత్ర పోషించారు. చిన్నపరెడ్డి కన్నుమూసిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి సతీమణి వసంతకుమారి, వారి తనయుడు కళ్యాణ్‌బాబులు చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. పార్టీకి పెద్దదిక్కును కోల్పోవడం చాలాబాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ, నాయకులు, అభిమానులు అచ్చంపేట నుంచి స్వగ్రామమైన తాళ్లచెరువు వరకు భారీ ఊరేగింపు, బైక్‌ర్యాలీతో అంత్యక్రియల్లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ గంగసానిబాబు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి తమ గ్రాఢ సంతాపాన్ని తెలిపారు.



తుమ్మా చిన్నపరెడ్డి (ఫైల్)

భవనం పైనుంచి జారి పడిన కూలీలు

ఇద్దరికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: బిల్డింగ్ పై నుంచి జారిపడి ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నాగన్న కుంటలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని నాగన్న కుంటలో మున్సిపల్ ఉద్యోగి మొహిద్దీన్ ఇంటిపై వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి అనే ఇద్దరు కూలీలను పని నిమిత్తం మాట్లాడుకున్నారు. వారు వాటర్ ట్యాంకు లాగేందుకు తాళ్లు కట్టగా, తాడు సరిపోకపోవడంతో అదనపు తాడు కట్టి పైకి లాగే క్రమంలో తాడు తెగిపోయింది. కార్మికులు ఒక్కసారిగా మూడు అంతస్తుల భవనం పై నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో బాణావత్ రాంబాబు నాయక్ నడుముకు తీవ్ర గాయాలు కాగా, ఖాజావలికి తలకు, తదితర చోట్ల గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ఇలాంటి కూలీలకు అండగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. బాధితుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.





గాయపడిన బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి